स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्वल भविष्य Glorious Past-Brighter Future

# ఆంధ్రావాలా

జి. మధుసూదన్ రెడ్డి



''ఎన్ని రోజులయిందండీ మిమ్మల్ని కలిసి, ఎలా ఉన్నారు?''

''ఆ... ఏదో లెండి ఉన్నాం ఇలా''

''అన్నట్టు మొన్నీ మధ్య మీ రెండో అమ్మాయి పెళ్లి చేసారట గదా. అల్లుడుగారు ఏం చేస్తున్నారో''

''ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్''

''ఇంకేం రెండు చేతులా సంపాదన. మీ అమ్మాయిది అదృష్టం''

''ఏం అదృష్టం నా బొంద మా అల్లుడుగారు అదో రకం. నీతి నిజాయితీ అంటూ సత్యకాలపు మనిషి''

''ఈ రోజుల్లో అలా వుంటే కష్టమే సుమండీ అంత మాత్రానికి గవర్నమెంట్ ఉద్యోగంలో ఎందుకు చేరినట్టో?''

''అంతా నా ఖర్మండీ! ఖర్మ''

***

''రోడ్డు వేసి నాలుగు నెలలైనా కాలేదు. అప్పుడే గుంతలు. అసలే స్పాండిలైటిస్, ఆపై ఈ డొక్కు స్కూటర్ ఒళ్ళంతా హూనమైపోతుంది''

''ఎవరో ఆ కాంట్రాక్టర్. లక్కీఫెలో! బాగా సంపాదించి ఉంటాడు''

''మా బాబు డొనేషన్ కట్టి ఉంటే ఇంజనీరింగ్ చదివేవాణ్ణి. ఇలాంటి వర్క్సులో పర్సెంటేజీ అయినా దక్కేది. వెధవ గుమాస్తా ఉద్యోగం. ఎదుగూ బొదుగూ లేదు''

''ఖర్మండీ బాబూ! ఖర్మ''

***

''ఈ అవార్డు రావడంపై మీ స్పందన''

''ఆలస్యంగా వచ్చినా చాలా సంతోషంగా ఉంది. ఇది నాకు ఇచ్చిన అవార్డు కాదు, తెలుగు భాషకు ఇచ్చిన రివార్డు''

''మీ కవిత్వంలాగే ప్రాసయుతంగా చక్కగా చిక్కగా చెప్పారు. అసలు మీ మాటల్లోనే అలవోకగా కవిత్వం జాలు వారుతుంటుంది. మీ కుటుంబ సభ్యులు అదృష్టవంతులు''

''ఆ... ఏం అదృష్టం లెండి. మా పిల్లలంతా కాన్వెంట్‌లలో చదువుకున్నారు. కవితావాణి వారికి దుర్గ్రాహ్యం. గుడ్డిలో మెల్ల...కనీసం అప్పుడప్పుడయినా తెలుగు పత్రికలు కూడ దీసుకుని చదువుతారు. మా మనుమళ్లున్నారే పొట్టచీల్చినా తెలుగు ముక్కరాదు. అంతా ఆంగ్లమయం''.

''తెలుగు దీనావస్థను అధిగమించడానికి ఒక సాహితీవేత్తగా, అవార్డు గ్రహీతగా మీ కార్యాచరణ''

''తెలుగు భాషకు ప్రాచీన హోదాను ఆపాదించేందుకు అవిశ్రాంత పోరాటం సాగిస్తాను''

***

''నువ్వు మగాడివైతే, మొనగాడివైతే, నీకు మూతి మీద మీసం ఉంటే ఇక్కడ కాదురా నా సీమకురా... వేట కొడవలి వాడి, నాటు బాంబుల వేడీ రుచి చూపిస్తా''

''నీ సీమకే కాదురా.... నీ పేట కొస్తా, నీ బాట కొస్తా, నీ ఇంటి కొస్తా ఏం పీక్కుంటావో చూస్తా... నా గోరే వజ్రాయుధం, నా చూపే అగ్నిహోత్రం, నా మాటే పాశుపతాస్త్రం నాతో పెట్టుకుంటే...''

''అబ్బా! ఏం డైలాగుల్రా బాబూ... ఎలా రాస్తారో అంత పవర్‌ఫుల్‌గా...''

''అందుకే గదా ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకుని ఇలాంటి వాళ్ళకు పదవులిచ్చి భాషాసేవ చేస్తుంది. ఈ పండితులున్నారే నన్నయ తిక్కన అంటూ నీరసంగా....''

***

''అన్నట్లు మీకు పరిచయం లేదుకదా. ఇతను నా ఫ్రెండ్ చక్కటి రచయిత. మీకు తెలిసే ఉంటుంది. ఈ మధ్యనే సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. వారు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తారు''

''సాహిత్య అకాడెమీ అవార్డు అంటే ఎంత ఇస్తారేవిటి?''

''ఒక లక్షరూపాయలిస్తారేమో!''

''ఓస్! అంతేనా, నిన్న లాండ్‌డీల్‌లో నా వాటా పదిలక్షలు. మొన్న పార్టీలో పరిచయమయ్యాడు వో రచయిత, సినీమాలకు కథలు రాస్తాట్ట. ఒక్కో సినిమాకు అయిదేసి లక్షలట. మీకు రాలేదాండి అవకాశం...''

***

''మీరు కమ్యూనిస్టు నాయకులై కూడా ఈ పూజలు పునస్కారాలూ..మార్క్సిజం దేవుడి ఉనికిని ఒప్పుకోదు కదా!''

''కానీ మా ఆవిడా పిల్లలూ ఒప్పుకుంటారే...''

''అంటే కేవలం మీ ఇంట్లో వాళ్ళ కోసమేనా ఈ పూజలు వ్రతాలూ...''

''అంతే కాదనుకోండి. ఏ మూలనో నా క్కూడా నమ్మకం లేకపోలేదు. రిస్క్ తీసుకోలేం కదా! ఎందుకైనా మంచిది చేతులు ఖాళీగానే ఉన్నాయని ఓ నమస్కారం పడేస్తున్నా...''

***

''.... ఈ టెండర్లలో వందకోట్ల రూపాయలు చేతులు మారాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

మరి వారు అధికారంలో ఉన్నప్పుడు రెండు వందల కోట్లు గోల్‌మాల్ జరిగిందని పత్రికల్లో వచ్చింది. దాని మాటేమిటి? మా పార్టీలో పాతిక శాతం మంది ఫ్యాక్షనిస్టులు, నేర చరిత్ర కలిగిన వారే నని గగ్గోలు పెడుతున్నారే మరి వారి పార్టీలో ఆ సంఖ్యయాభై శాతం పైనే అనడానికి నా దగ్గర ఆధారాలున్నాయి. గురివింద గింజలాగా మాపై నిందలు వేయడానికి వారికి నైతిక అర్హత లేదు. కాబట్టి ప్రతిపక్షం వారు చేసే....''

''చూసారాండీ...నాయకుడంటే అలా ఉండాలి. ఏమి వాగ్ధాటి! ఏమి ఖండన! ఈయనకు ముఖ్య మంత్రి పదవి రాకపోవడం నిజంగా దురదృష్ట కరం. కానీ తప్పకుండా ఏదో ఒక రోజు...''

***

''ఇన్నాళ్ళ నా విన్నపాన్ని మన్నించి స్వామీజీ మొన్ననే మా గృహాన్ని పావనం చేశారు. ఏమి తేజస్సు! ఏమి వర్చస్సు!''

''నిజంగా మీరు పుణ్యం చేసుకున్నారండి. పెద్ద పెద్ద వాళ్ళకు మాత్రమే కలిగే వారి దర్శన భాగ్యం మీకు కలిగింది. అఫ్‌కోర్స్! మీకు మాత్రం తక్కువా ఏమిటి?''

''స్వామీజీ రాక అంటే మామూలు మాట కాదు. బానర్లు, కార్పెట్లు పరవాలి. టీవీ కవరేజి అరేంజ్ చేయాలి. వారికీ, వారి శిష్యులకు స్వచ్ఛమైన ఆవుపాలతో మృష్టాన్న భోజనాలు ఏర్పాటు చేయాలి. ఆశ్రమానికి డొనేషన్లు...పాదసేవకు, అనుగ్రహ భాషణానికి అదనపు చదివింపులు...''

''ఖర్చు బాగానే అయ్యుంటుంది''

''అయితేనేం మంత్రాలూ అధికారులు అందరూ స్వామీజీ భక్తులే. పనిలో పనిగా కాంట్రాక్ట్ టెండర్ విషయం కదిపా. అనుగ్రహించారు స్వామీజీ. వారి అనుగ్రహం ఉంటే ఏమి లోటు...''

''ఎప్పుడైనా వీలు చూసుకుని నా కార్యం ఒకటి స్వామి వారితో రుణం ఉంచుకోను లెండి...''

***

''హలో గురూ! ఎప్పుడొచ్చావు హైద్రాబాద్ నుంచి?''

''నిన్న మార్నింగ్ దిగా గోదావరిలో''

''ఎలా ఉంది బాసూ అక్కడ జాబ్. అడ్జస్టయ్యావా''

''స్టార్టింగ్‌లో హైద్రాబాద్ ట్రాన్స్‌ఫరంటే భయపడ్డా కానీ సూపర్‌గా ఉంది బాసూ అక్కడ. నైస్ వెదర్... ఇన్నోసెంట్ పీపుల్... కానీ లాంగ్వేజ్ కొంచెం డిఫరెంట్. ఉర్దూ మిక్సింగెక్కువ. మన తెలుగు లాగా ప్యూర్‌గా ఉండదు''

''మరి పట్టుబడిందా అక్కడి మాట తీరు''

''అబ్బే! మనం ఎప్పుడు చేంజ్ కావాలి. వాళ్ళ తిప్పలు వాళ్ళేపడతారు. నే చెప్పలా వాళ్ళు ఇన్నోసెంట్ పీపులని....''

''ఎంతైనా నువ్వు అసాధ్యుడివి బాసూ...''

***

''... ఎలిగేషన్ మీద లూప్‌లైన్ పోస్టింగిచ్చారు. మా కమీషనర్ తలతిక్క. ఎవరిమాటా వినడు. వెంకన్నస్వామిని మొక్కుకున్నా...నెల తిరక్కుండా కమీషనర్ ట్రాన్స్‌ఫరయ్యాడు. మంత్రిగారితో పడక. ఆయన మనవాడే...మళ్ళీ నెల తిరక్కుండా చార్జ్‌మెమో విత్‌డ్రా అయ్యింది. అనుకున్న పోస్టింగూ వచ్చింది. తిరపతెళ్లి నిన్ననే వచ్చా. మొక్కు తీర్చుకుని...''

***

''మీకులా కాదండీ మా లా ప్రొఫెషన్లో...క్రిమినల్ కేసుల్లో మరీనూ..సాక్షుల్ని లొంగదీయాలి. పోలీసుల్ని, పి.పి.ని అవసరమైతే జడ్జీలను మానేజ్ చేయాలి. రెండు సంవత్సరాల క్రితం ఓ కేసు వచ్చింది. వివరాలు ఎందుగ్గాని క్లయింట్ బ్యాక్ గ్రౌండ్ పెద్దది. కాలేజీలో క్లాస్‌మేట్ వెంటపడ్డాడు ప్రేమిస్తున్నానని. ఈ జులాయి వెధవ నెవ్వరు ప్రేమిస్తారు? రోజూ అల్లరి.. ఆ అమ్మాయి పాపం కాలేజీ మానేసింది. ఇంటి దగ్గరి కెళ్లి నానా గొడవ, ఘర్షణ పెరిగి కత్తితోపొడిచి చంపాడు పబ్లిగ్గా. ఎలాగైనా కేసు గెలిపించమంటాడు వాళ్ళ నాన్న. కేసు టేకప్ చేయొద్దనుకున్నా కానీ ఆయన పలుకుబడి ఉన్నవాడు. పైగా ఫీజు భారీ. అయ్యప్ప స్వామి మీద భారం వేశా.. ఎలిబీ సృష్టించి కేసు గెలిపించడానికి తలప్రాణం తోకకు వచ్చింది. అప్పట్నుంచి ప్రతీ సంవత్సరం తప్పని సరి అయ్యప్పస్వామి దీక్ష.''

''మనం అనుకుంటాం కానీ దైవానుగ్రహం లేనిదే ఏది సాధ్యమండీ! పెద్దలు ఊరికే అన్నారా శివుడాజ్ఞ లేనిదే...''

***

''ఓల్డ్ ఏజ్‌లో ఇంత కష్టపడుతున్నారు. మీ ఇంటి ఓనర్స్‌కి పిల్లలు లేరా...''

''ఎందుకు లేరు. ఉన్న ఇద్దరూ ఫారిన్లో సెటిలయ్యారు''

''వీళ్లూ వెళ్ళి అక్కడే ఉండొచ్చుగా...''

''ఏం చేప్పేది? పాపం పిల్లల కెరియర్ కోసం వీళ్ళు ఎంతో త్యాగం చేశారు. గ్రాండ్ పేరెంట్స్ ఉంటే గారాబం ఎక్కువై చదువు రాదనీ, ఇంగ్లీషులో మాట్లాడరని కన్న తల్లి దండ్రుల్నీ దూరంగా ఉంచారు. కానీ ఇప్పుడా పిల్లలు తమ పిల్లల కెరియర్ కోసం వీళ్ళను త్యాగం...''

***

''రాను రాను సమాజం ఎక్కడికి పోతుందో అర్థం కావడంలేదు. ఎటు చూసినా అవినీతి...స్వార్థం... వ్యాపార ధోరణి పెరిగిపోతుంది. మన భాషా సంస్కృతి నాశనమైన పోతున్నాయి. దొంగ స్వాములూ..దొంగ భక్తులూ...''

''అయ్యా! సమాజ మంటేప్రజలే వారి అర్హతను బట్టే సమాజం. గంజాయి విత్తులు నాటుతూ తులసి మొక్కలు రావాలంటే...''

